# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 29-08-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.**
2. **అల్లూరి సీతారామరాజు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.**
3. **విద్యార్థి దశ నుంచే తెలుగు భాషపై ఆసక్తి పెంచాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**
4. **క్రీడా రంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం గన్నెల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై గిరిజనులతో ఆయన సంభాషించారు. అనంతరం గన్నెల కూడలి వద్ద ఆరోగ్య రథాలు, టాటా నర్వ్ సంజీవని ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ..

వాయిస్ 30 సెకన్స్

--------------------------

విజయవాడ నుంచి నెల్లూరుకు డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ ఈరోజు చేరుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయాన్ని ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, నిపుణులు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌లతో కూడిన ఈ

కమిటీ ఈరోజు రేపు జలశయాన్ని పరిశీలించనుంది. రెండు రోజుల పాటు డ్యామ్ భద్రత, నాణ్యత స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత ఈ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేయనుంది. ఆ తర్వాత ఈనెల 31వ తేదీ, సెప్టెంబర్ 1వ తేదీల్లో కండలేరు జలాశయాన్ని కూడా ఈ నిపుణుల కమిటీ పరిశీలించనుంది.

-------------------------

తెలుగు భాష, లిపి భావితరాల్లోనూ సజీవంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పిల్లలకు తెలుగు సహా భారతీయ భాషలను చదవడం, రాయడం నేర్పించే 'కూల్‌ఫాబెట్స్' యాప్‌ను ఆయన ఎక్స్ వేదికగా అభినందించారు. డిజిటల్ యుగంలోనూ చిన్నారులకు తెలుగు అక్షరాలు చదవడం, రాయడం అలవాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చిన్ననాటి నుంచే అక్షరంపై ఆసక్తి, భాషపై అభిమానం పెంచాలన్నారు. కృత్రిమ మేధ సాంకేతికతతో పిల్లల చేతిరాతను పరిశీలించి, అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా యాప్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. సాంకేతికత భాషను దూరం చేయకుండా, మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే విద్యార్థి దశ నుంచే తెలుగు భాషపై ఆసక్తి పెంచాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

-------------------------

కేంద్రప్రభుత్వ పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి.మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణించడానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. వాటిల్లో ఒకటి ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన పథకం. తిరుపతి జిల్లాలో ఈ పథకం ద్వారా వందలాదిమంది మహిళల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయి. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం అబ్బాపల్లికి చెందిన జీవన ఈ పథకం ద్వారా రాయితీ కింద రుణాలను పొంది ఆటోను కొనుగోలు చేశారు. ప్రతినెలా 10 నుంచి 15వేల రూపాయల వరకు సంపాదిస్తున్నట్లు లబ్ధిదారు జీవన తెలియజేస్తూ..

వాయిస్ 29 సెకన్స్

-------------------------

అగ్నివీర్ పథకం కింద వచ్చే నెల 2వ తేదీ అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పై ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు ఆర్కే బీచ్ రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కి.మీల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 10,350 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ర్యాలీ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఇద్దరు నోడల్ అధికారులను నియమించినట్లు వివరించారు.

-------------------------

క్రీడలు శారీరక దృఢత్వానికే కాదు.. క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సాధనాలు. దేశంలో క్రీడల ప్రాధాన్యాన్ని చాటిచెప్పేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా

దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. హాకీ దిగ్గజం, భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయుడైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. హాకీలో అసాధారణ ప్రతిభ కనబరిచిన ధ్యాన్‌చంద్, భారత్‌కు వరుసగా మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన క్రీడాస్ఫూర్తి, అంకితభావం నేటి తరం క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా క్రీడా పోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశం.

---------------------------

క్రీడా రంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పేరుతో నిర్వహించిన క్రీడాల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. క్రీడాకారుల్లో మరింత స్ఫూర్తి నింపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలియజేస్తూ..

వాయిస్ 25 సెకన్స్

---------------------------

పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీరాలపై ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో పశ్చిమ, వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు వెల్లడించారు. ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్.. 20 సెకన్లు

---------------------------

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నం జిల్లా ఎండాడలో మూడు కోట్ల ఇరవై లక్షల రూపాయలతో నిర్మించనున్న జీవ ఎరువుల ఉత్పత్తి ప్రయోగశాలకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ ఇంటర్వెన్షన్, నిల్వ సదుపాయాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉండడంతో జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

=====================